సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



గాలివాన బీభత్సం

జిల్లాలోని పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. అనేకచోట్ల పంటలు నేలకొరగగా, రేకుల పెడ్లు కొట్టుకుపోయాయి.

- 8లో ▸



నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్లు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లాయని డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి విమర్శించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.1 /24.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తరుగు తీస్తే ఆందోళనలు చేపట్టాలి

■ జూమ్ మీటింగ్‌లో ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు లేకుండా కొనుగోళ్లు జరిగేలా చూడాలని, తరుగు తీస్తే ఆందోళనలు చేపట్టాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. సోమవారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎంపీ జూమ్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 6 నుంచి 8 కిలోల తరుగు తీస్తున్నారని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రెండు రోజుల క్రితం మోర్తాడ్ సొసైటీ పరిధిలో జరిగిన ఘటనపై స్థానిక నాయకుల వద్ద ఆరా తీశారు. మూడ్రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా జగిత్యాల జిల్లాలో 40వేల ఎకరాలకుపైగా మామిడి, నువ్వు, జామ, వరి పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పక్షాన పోరాటం చేసి వారికి అండగా నిలబడాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చాలామంది రైతులకు మద్దతు ధర దక్కలేదని, దళారులకు అమ్మి నష్టపోయారని తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతూ కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. అలాగే పార్లమెంట్ పరిధిలో బూత్ స్వశక్తీ కరణ్‌పై సమీక్ష నిర్వహించి, మిగిలిన పోలింగ్ బూత్‌లలో తక్షణమే పూర్తి చేసి రాష్ట్ర పార్టీకి అందజేయాలని ఎంపీ అర్వింద్ సూచించారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. మే 4వ తేదీ వరకు ఈ పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు. జిల్లాలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్ వారు 3,359 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12:30 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాక్టికల్స్ మే 12 నుంచి 15 వరకు జరుగుతాయి.

చిన్నికృష్ణుడికి డాక్టరేట్



సుభాష్‌నగర్: జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన రైతు చిన్నికృష్ణుడికి తెలోజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వివిధ రంగాల్లో ప్రగతి సాధించిన 10 మందికి వర్సిటీ వారు డాక్టరేట్ అందించారు. అందులో జిల్లా నుంచి చిన్నికృష్ణుడు అందుకున్నారు.

27న నిధి ఆప్కే నికట్ 2.0

నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఈనెల 27న నిధి ఆప్కే నికట్ 2.0(మీ ఇంటి వద్దకే ఈపీఎఫ్‌వో) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయ కమిషనర్ మధుసూదనచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోధన్‌లోని సరస్వతినగర్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో, కామారెడ్డిలో లయోలా హైస్కూల్‌లో ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. కావున పీఎఫ్ చందాదారులు, యాజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి ఆప్కే నికట్ 2.0కు హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫిర్యాదులను విని అక్కడికక్కడే పరిష్కారం తెలియజేస్తారన్నారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

రుద్రూర్: ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల్లో (ఈనెల 25, 26, 27వ తేదీల్లో) ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కూడా కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సాగర్‌లో భారీ పూడిక

- 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం
- 1994లో ఏపీఈఆర్ఎల్ సర్వే ప్రకారం 90 టీఎంసీలే..
- 2013–14 సర్వేలో 70 టీఎంసీలకు పడిపోయినట్లు సమాచారం
- ఆ నివేదికను బయటపెట్టని అధికారులు
- ప్రతియేటా వచ్చి చేరుతున్న పూడిక 0.8 టీఎంసీలు



ఎస్సారెస్పీ రిజర్వాయర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం ఏటేటా తగ్గిపోతోంది. జలాశయంలో భారీగా పూడిక పేరుకుపోతుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రస్తుతం ఇందులో 70 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం మాత్రమే ఉన్నట్లు సమాచారం. 1963 జూలై 26న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఎస్సారెస్పీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యాక 1978లో మొదటిసారి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేశారు. 1978లో హైడ్రోగ్రాఫిక్ సర్వే ప్రకారం జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీలుగా ప్రకటించారు. అప్పటినుంచి 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. అయితే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదలతో ప్రాజెక్ట్‌లోకి భారీగా పూడిక వచ్చి చేరుతోంది.

■ 1994లో ఏపీఈఆర్ఎల్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ లేబరేటరీస్) సర్వే ప్రకారం ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలకు పడిపోయిందని నివేదిక ఇచ్చారు. అప్పటి నుంచి అదే లెక్క ప్రకారం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం చూపిస్తున్నారు. ఈ క్రమంలో 2013–14లో 'ఏపీఈఆర్ఎల్' సంస్థ ద్వారా మరోసారి పూడికపై సర్వే నిర్వహించారు. ఈ సర్వే ప్రకారం జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం 70 టీఎంసీలకు పడిపోయినట్లు తెలిసింది. కానీ ఇప్పటివరకు సదరు నివేదికను అధికారులు బయటపెట్టలేదు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదల కారణంగా ప్రతి సంవత్సరం 0.8 టీఎంసీల పూడిక వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డుల ద్వారా తెలుస్తోంది.

■ 1978 నుంచి 1994 వరకు 17 సంవత్సరాల కాలంలో జలాశయంలోకి 22 టీఎంసీల మేర పూడిక వచ్చి చేరినట్లు సర్వేలు నిర్ధారించాయి. ఈ క్రమంలో 1994 నుంచి ఇప్పటివరకు 28 సంవత్సరాల్లో మరింత పూడిక వచ్చి ఉంటుంది. అయితే 1994 లెక్కల ప్రకారం మాత్రమే నీటి నిల్వ సామర్థ్యాన్ని 90 టీఎంసీలుగా ఎస్సారెస్పీ అధికారులు చెబుతుండడం గమనార్హం. పూడిక తొలిగించడం కోసం ఆరు రివర్స్ స్లూయిజ్ గేట్లను వరద గేట్ల అడుగున నిర్మించారు. మిగులు జలాలను గోదావరిలోకి వదిలినప్పుడు ఆ ఆరు గేట్లను ఎత్తితే ఎంతో కొంత పూడిక తొలగిపోతుందని భావించారు. కాగా ఇప్పటివరకు ఆ గేట్లను ఒక్కసారి కూడా ఎత్తలేదు. దీంతో ఆ గేట్లు పూర్తిగా పూడికలో కూరుకుపోయాయి.

జిల్లాల వారీగా శ్రీరాంసాగర్ ఆయకట్టు వివరాలు..

జిల్లా	ఆయకట్టు (ఎకరాల్లో..)
నిజామాబాద్	1,60,578
ఆదిలాబాద్	1,45,387
కరీంనగర్	6,72,900
వరంగల్	4,71,478
ఖమ్మం	1,28,914
నల్గొండ	2,87,508



పొంతన లేని లెక్కలు..

ప్రస్తుత యాసంగికి సంబంధించి 63 టీఎంసీల శ్రీరాంసాగర్ జలాలను కేటాయించారు. ఇందులో ఇప్పటివరకు 70 టీఎంసీలు విడుదల చేశారు. ఏడు టీఎంసీలు అదనంగా కేటాయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 20 టీఎంసీల నీరు ఉందంటున్నారు. ఇందులో తాగు నీటి కోసం 5 టీఎంసీలు, ఆవిరి రూపంలో పోయే 5 టీఎంసీలు, డెడ్ స్టోరేజీ 5 టీఎంసీలు పోగా, ఇంకా 05 టీఎంసీలు మాత్రమే ఉన్నట్లు లెక్క. అయితే పూడిక తొలగిస్తే యాసంగికి ఇబ్బంది లేకుండా మరో 25 టీఎంసీల వరకు నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కాగా ఈ ఏడాది ఇక్కడి నుంచి 395 టీఎంసీలకు పైగా నీరు దిగువకు వృథాగా వెళ్లడం గమనార్హం.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు వివరాలు.. (ఎకరాల్లో..)

	ఆయకట్టు		
ఎస్సారెస్పీ మొదటి దశ	9,68,640	అలీసాగర్ ఎత్తిపోతలు	57,793
ఎస్సారెస్పీ రెండో దశ	4,40,000	గుత్ప ఎత్తిపోతల పథకం	38,967
వరద కాలువ (మిడ్‌మానేరు)	2,20,000	చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల	11,600
సదరమట్ ఆయకట్టు	12,000	జిల్లాలో 14 ఎత్తిపోతలు	34,948
కడెం ప్రాజెక్ట్	68,000	ఆదిలాబాద్ జిల్లాలో 9 ఎత్తిపోతలు	30,417
		మొత్తం ఆయకట్టు (ఎకరాలు)	18,66,765

సాక్షి విద్యార్థులకు వేసవి శిబిరం

'సాక్షి' మీడియా గ్రూప్ ఈ నెల 26, 27, 28 తేదీల్లో వేసవి శిబిరాలకు ఆహ్వానం పలుకుతోంది. ఔత్సాహిక చిన్నారులు ఈ శిబిరాల్లో పాల్గొనవచ్చు.

■ 26.04.2023న చిత్రలేఖనం పోటీ (4, 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మాత్రమే) మెటీరియల్ ఎవరిది వారే తెచ్చుకోవాలి.

■ 27.04.2023న చదరంగం పోటీ (5, 6, 7 తరగతుల విద్యార్థులకు మాత్రమే)

■ 28.04.2023న చదరంగం పోటీ (8, 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే)

వేదిక కాకతీయ ఒలంపియాడ్ స్కూల్, ప్రగతినగర్, నిజామాబాద్.

సమయం ఉదయం 10 గంటల నుంచి

వివరాలకు, పేర్ల నమోదుకు **9553130597, 8978036828** నంబర్లలో సంప్రదించాలి.

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- మోపాల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): అకాల వర్షాలు కురుస్తున్నందున రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వీలైనంత త్వరగా నిర్దేశించిన రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. సోమవారం మోపాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధాన్యం నిల్వలను సందర్శించి నాణ్యతను పరిశీలించారు. తేమ కొలిచే యంత్రం ద్వారా తేమ శాతాన్ని లెక్కించారు. బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయి మద్దతు ధర పొందాలని ఈసందర్భంగా రైతులను కోరారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల వద్ద మాయిశ్చర్ యంత్రాలు, టార్పాలిన్లు, వెయింగ్ మెషిన్లను సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. కేంద్రాల వద్ద సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతంగా, పూర్తిస్థాయిలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. ధాన్యం దిగుబడులు వర్షాలకు తడిసిపోకుండా కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు కూడా వెంటనే అన్‌లోడ్ చేసుకుని, సకాలంలో లారీలను కేంద్రాలకు పంపించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు, తహసీల్దార్ లత, ఎంపీడీవో లింగం, సీఈవో సాయిచంద్ ఉన్నారు.



మోపాల్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అంబులెన్స్‌లో ప్రజావాణికి..

- కొడుకు పట్టించుకోవడం లేదని తల్లి ఫిర్యాదు
- తనకు తెలియకుండా భూమార్పిడి చేసుకున్నాడని ఆవేదన

సాక్షి, కామారెడ్డి : వృద్ధాప్యం ఆపై అనారోగ్యంతో ఉన్న తనను కొడుకు పంట్టించుకోవడం లేదని, పైగా తనకు తెలియకుండానే తన భర్త పేరిట ఉన్న భూమిని మార్చుకున్నాడని ఎనభై ఏళ్లకు పైబడిన ఓ తల్లి ఆరోపించింది. ఈ మేరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి సోమవారం అంబులెన్స్‌లో కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సుల్తాన్‌పేట్ గ్రామానికి చెందిన వీరభద్రప్ప, రత్నమ్మ దంపతులకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లున్నారు. అందరికీ పెళ్లిల్లయ్యాయి. చాలా కాలంగా తల్లిదండ్రులను కొడుకు పట్టించుకోకపోవడంతో వారిద్దరు కూతుళ్ల దగ్గరే ఉంటుండగా, 2017 ఆగస్టు 8న వీరభద్రప్ప చనిపోయాడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లి రత్నమ్మను కూతుళ్లే చూసుకుంటున్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకు శంకర్ తండ్రి పేరిట మారేపల్లి శివారులో సర్వేనంబరు 101 లో ఉన్న 13.29 ఎకరాల వ్యవసాయ భూమిని తల్లికి తెలియకుండానే తన పేరిట మార్చుకున్నాడు.

ఈ మేరకు రత్నమ్మ తన ఆలనాపాలనను కొడుకు పట్టించుకోవడం లేదని, తండ్రి పేరిట ఉన్న భూమిని మాత్రం అనుభవిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తాను కూతుళ్ల దగ్గర ఉంటున్నానని ఫిర్యాదులో పేర్కొంది. కలెక్టరేట్ సూపరింటెండెంట్ సాయి భుజంగరావు అంబులెన్సు వద్దకు వచ్చి వృద్ధురాలి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. రత్నమ్మ మనవరాలు ఐశ్వర్యతో పాటు కూతుళ్లు ఆమె వెంట వచ్చారు.



వృద్ధురాలు రత్నమ్మ నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ సాయిభుజంగరావు

బాల శ్రీనివాసమూర్తి మృతి తీరనిలోటు

- మనస్తాపంతోనే గుండెపోటుతో మరణించారు
- తెయూ వీసీ రవీందర్
- అంత్యక్రియలకు తరలివెళ్లిన అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ జి.బాల శ్రీనివాసమూర్తి సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందడం యూనివర్సిటీకి తీరని లోటని వీసీ రవీందర్ అన్నారు. విషయం తెలిసిన వెంటనే వీసీ హైదరాబాద్ కొంపల్లిలోని బాల శ్రీనివాసమూర్తి స్వగృహానికి వెళ్లారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. తెలుగు విభాగంలో పనిచేస్తున్న బాల శ్రీనివాసమూర్తి ఇటీవల ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారని, ఈ పదోన్నతిని పాలక మండలి సభ్యులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారని తెలిపారు. ఆయన గుండెపోటుకు గురై మరణించడం చాలా బాధాకరమన్నారు. ఆయన మృతి తెలుగు భాషకు తీరని లోటని, యూనివర్సిటీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తెయూ వీసీ రవీందర్

నివాళులర్పించిన ఉన్నత విద్యామండలి చైర్మన్

ప్రొఫెసర్ బాలశ్రీనివాసమూర్తి మృతి విషయం తెలియగానే రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. తెయూ రిజిస్ట్రార్‌గా పని చేసిన కాలంలో బాల శ్రీనివాసమూర్తితో తనకున్న సాన్నిహిత్యాన్ని తలుచుకున్నారు.

కొంపల్లిలో అంత్యక్రియలు

గుండెపోటుతో మృతిచెందిన ప్రొఫెసర్ బాలశ్రీనివాసమూర్తి అంత్యక్రియలు కొంపల్లిలో జరిగాయి. తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, మాజీ రిజిస్ట్రార్లు విద్యావర్ధిని, కనకయ్యతో పాటు పలు విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హైదరాబాద్‌కు తరలివెళ్లి బాల శ్రీనివాసమూర్తి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన కుటుంబానికి తమ సంతాపం వ్యక్తం చేశారు.

మహిళా హక్కుల పరిరక్షణే ధ్యేయం

- చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

సుభాష్‌నగర్: మహిళల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి సూచించారు. మహిళల భద్రత కోసం ఉద్దేశించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అప్పుడే మహిళలు తమకు అన్యాయం జరిగిన సందర్భాల్లో తగిన న్యాయం పొందవచ్చన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్ సెమినార్‌లో పాల్గొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత, సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు సెమినార్‌లో వివరించారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళల హక్కులకు భంగం కలిగినప్పుడు బాధితులకు తగిన న్యాయం చేస్తూ, వారికి అండగా నిలుస్తున్నామన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను వినియోగించుకుంటూ నేటి సమాజంలో బాలికలు, యువతులు ఉన్నత చదువులు అభ్యసిస్తూ అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. కానీ అక్కడక్కడ మహిళలపై వివక్షతతో కూడిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మహిళలపై జరిగే దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలను నిరోధించేందుకు ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. ఏ సమస్య ఉన్నా మహిళలు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇ–మెయిల్ ద్వారానే కాకుండా వాట్సాప్ నంబర్ 9490555533 ద్వారా కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని చైర్‌పర్సన్ సూచించారు. హెల్ప్‌లైన్ నెంబర్ – 181 ద్వారా కూడా సహాయం పొందవచ్చన్నారు. వీటి గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని యంత్రాంగానికి సూచించారు.



శిశుగృహ విద్యార్థులను పలకరిస్తున్న చైర్‌పర్సన్

మహిళలు, బాలల సంరక్షణకు చర్యలు : కలెక్టర్

మహిళలు, బాలల సంరక్షణ కోసం రాజ్యాంగంలోని చట్టాలను అనుసరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల చర్యలు చేపడుతున్నాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో వీటిని పరిపూర్ణంగా అమలు జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అప్పుడే ప్రభుత్వాలు చేపట్టే చర్యలు పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను చైర్‌పర్సన్ సందర్శించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బాలసదన్ శిశు గృహం, సఖి సెంటర్, స్వధర్ హోంలను మహిళా కమిషన్ బృందం సందర్శించింది. వసతి పొందుతున్న చిన్నారుల బాగోగుల గురించి ఆరా తీశారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు షాహీన్, రేవతి, సూదం లక్ష్మి, పద్మ, ఈశ్వరీ బాయి, ఉమాదేవిలతో పాటు మహిళాకమిషన్ డైరెక్టర్ శారద, జిల్లా కమిటీ చైర్‌పర్సన్ నీరజారెడ్డి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో సమ్మెపై నిషేధం

- సమ్మెకు వెళితే కఠిన చర్యలు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో సమ్మె నిషేధించబడిందని.. ఎవరైనా సమ్మెకు వెళ్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విద్యుత్‌శాఖ సీఎండీ గోపాల్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15న విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగ సంఘాలతో వేతన సవరణ ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఆర్టిజన్లకు కూడా కార్మిక సంఘాల అభ్యంతరాల మేరకు వేతన సవరణ చేపట్టినట్లు తెలిపారు. అయినా కొందరు ఆర్టిజన్లు, కొన్ని కార్మికసంఘాలు ఈనెల 25 నుంచి సమ్మెకు వెళ్లడానికి పిలుపునిచ్చినట్లు తెలిసిందన్నారు. విద్యుత్ సంస్థల్లో అత్యవసర సర్వీసుల చట్టం ఎస్మా అమలులో ఉన్నందున ఎవరూ సమ్మెలోకి వెళ్లవద్దని సూచించారు.

ప్లాటు రిజిస్ట్రేషన్ చేయించడం లేదని ఆత్మహత్య

మూడురోజుల తర్వాత వెలుగులోకి ఘటన

మాక్లూర్: అష్టకష్టాలు పడి కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేయించకపోవడమే కాకుండా.. బెదిరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దాస్‌నగర్ శివారులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని కోటగల్లికి చెందిన బిల్ల రాజేశ్వర్‌ది నిరుపేద కుటుంబం. రాజేశ్వర్ నగరంలోని హిమ్మత్‌వాలా బీడీ కంపెనీలో అటెండర్‌గా పనిచేస్తాడు. వచ్చిన జీతం డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ.. కొద్దికొద్దిగా కూడబెట్టిన డబ్బులతో నాగారంలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద రత్నాకర్, రవీందర్, మరో మహిళ కలిసి విక్రయించిన ఇంటి స్థలాన్ని రూ. 2 లక్షలకు ఏడాది క్రితం కొనుగోలు చేశాడు. డబ్బులు ముట్టినప్పటికీ వారు ప్లాటు రిజిస్ట్రేషన్ చేయించడం లేదు. చాలా రోజులుగా వారు రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బంది పెడుతుండడంతో ఇదే విషయమై గత శుక్రవారం రాజేశ్వర్ వారిని నిలదీయగా బెదిరించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాజేశ్వర్ అదేరోజు ఇంటి వెళ్లి సూసైడ్ నోట్ రాసి దాస్‌నగర్ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం సమీపంలోని గోశాల యజమానికి మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా చేరుకుని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య లత, కుమారులు రోహిత్, హర్షిత్ ఉన్నారు. పెద్ద కుమారుడు రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.



బిల్ల రాజేశ్వర్(ఫైల్)

క్లుప్తంగా

ఫిర్యాదులను పరిష్కరించాలి



కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 57 ఫిర్యాదులు వచ్చాయి. శిక్షణ కలెక్టర్‌ శివేంద్ర ప్రతాప్‌, ఏవో రవీందర్‌ పాల్గొన్నారు.

రైల్వే గేటు మరమ్మతులు పూర్తి



ఇందల్వాయి: ఇందల్వాయి రైల్వే గేటు వద్ద ట్రాక్‌ మరమ్మతులు, నూతన విద్యుత్‌ లైన్‌ పరీక్షలు ముగిసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

కొనసాగుతున్న బీపెడ్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీపెడ్‌ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ఎం అరుణ తెలిపారు. 36 మంది విద్యార్థులకు 33 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు.

నేడు రగ్బీ పోటీలకు ఎంపికలు

మోపాల్‌: నగరశివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో అండర్‌–18 ఓపెన్‌ టు హాల్‌ రగ్బీ ఎంపికలు మంగళవారం సాయంత్రం ఉంటాయని పీడీ అబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

గాలివాన బీభత్సం..

- నాగంపేట్‌లో కూలిపోయిన 5 రేకుల షెడ్లు
- నేలకొరిగిన విద్యుత్‌ స్తంభాలు, వృక్షాలు



నాగంపేట్‌లో కూలిపోయిన రేకుల షెడ్డు



కొట్టుకుపోయిన రేకులు

బాల్కొండ: ముప్కాల్‌ మండలం నాగంపేట్‌ గ్రామాన్ని సోమవారం మధ్యాహ్నం వచ్చిన గాలివానా ఆగం చేసింది. గ్రామంలో భారీగా ఈదురు గాలులు వీయడంతో నాలుగు విద్యుత్‌ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. రేకుల షెడ్డుతో నిర్మించుకున్న ఇళ్లు కూలిపోయి ఐదు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గ్రామాన్ని గాలివానా అతలాకుతలం చేసింది. విద్యుత్‌ సరఫర నిలిచిపోయింది. రాత్రి అంతా అంధకారంలో గ్రామస్తులు మగ్గారు. రేకుల షెడ్డు మీద రేకులు ఎగిరి కొన్ని మీటర్ల దూరంలో పడిపోయాయి. రేకుల షెడ్డుపై నిర్మించిన ఇటుక కట్టడాలు కూలి ఇంట్లో ఉన్న వారిపై పడ్డాయి. దీంతో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. పెద్దవాగు రోడ్డుకు ఇరుపక్కల పెంచిన చెట్లు విరిగి పడ్డాయి.

కమ్మర్‌పల్లి: మండలంలోని కమ్మర్‌పల్లి, హాసాకొత్తూర్‌, చౌట్‌పల్లి, బషీరాబాద్‌, ఉప్లూర్‌ తదితర గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి నువ్వు పంట, వరి ధానానికి నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. వారం పది రోజుల్లో కోతకు వస్తున్న దశలో నువ్వు పంట నేలకొరగడం రైతులను ఆవేదనకు గురి చేస్తోంది.

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఆలూర్‌ బైపాస్‌ రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. అలాగే మధ్యాహ్నం జిరాయత్‌ నగర్‌ కాలనీలో వడగండ్ల వర్షం కురిసింది.



ఆలూర్‌ బైపాస్‌ రోడ్డు వద్ద తడిసిన ధాన్యం



హాసాకొత్తూర్‌లో నేలకొరిగిన నువ్వు పంట



నాగంపేట్‌లో విరిగిన విద్యుత్‌ స్తంభం



నేలకొరిగిన చెట్టు

ఇటుకలు మీద పడ్డాయి



ఇల్లు లేక రేకులతో చిన్న రూం కట్టుకున్నా. ఇప్పుడు గాలివానా వచ్చి రేకులు మొత్తం కొట్టుకుపోయాయి. గోడ ఇటుకలు కూలి చేతి మీద పడ్డాయి. ప్రాణాలు పోతాయని భయమేసింది. ఇల్లు లేకుండా పోయింది ప్రభుత్వం ఆదుకోవాలి. – ముత్తెమ్మ, నాగంపేట్‌

ఉండటానికి ఇల్లు లేదు



ఉండటానికి ఇల్లు లేకపోవడంతో చిన్నగా రెండు రూంలతో రేకుల షెడ్డు వేసుకున్నాం. ఇప్పుడు అది కూడా లేకుండ పోయింది. ఈదురు గాలులకు రేకులు ఎగిరి నాలుగు ఇళ్ల అవతల పడ్డాయి. ఒక్క రేకు కూడా పనికి రాదు. – గంగాధర్‌, బాధితుడు

నిందితులు గ్రామాన్ని వీడాలని నిరసన

రాజంపేట: నెల రోజుల క్రితం కొప్పుల ఆంజనేయులను చంపిన కేసులో నిందితులైన ఆయన కూతుర్లు లక్ష్మీనర్సవ్వ, నీలావతి, మనవడు భానుప్రసాద్‌ బెయిలుపై బయటకు వచ్చారు. దీంతో ఆంజనేయులు మృతికి కారణమైన వారు గ్రామాన్ని వీడాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తు రోడ్డుపై బైఠాయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులను, గ్రామస్తులను సముదాయించారు. చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని గ్రామస్తులను సముదాయించారు. అదే విధంగా నిందితులకు గ్రామస్తులు చెప్పినట్లు నడుచుకోవాలని సూచించారు. చివరకు నిందితులు గ్రామాన్ని వీడిపోవడంతో గ్రామస్తులు శాంతించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

లోతట్టు ప్రాంతాల పరిశీలన



నిజామాబాద్‌నాగారం : నగరంలోని 41వ డివిజన్‌ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సోమవారం మున్సిపల్‌ కమిషనర్‌ చిత్రమిశ్రా పరిశీలించారు. అక్కడ ఇబ్బందులు తెలుసుకుని వర్షకాలంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్‌ బూరుగుల ఇందిర వినోద్‌కుమార్‌, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

కామారెడ్డిరూరల్‌: ప్రభుత్వ బడుల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచేత నాణ్యమైన బోధన లభిస్తుందని జిల్లా విద్యాశాఖధికారి రాజు పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2022– 23 విద్యా సంవత్సరం చివరి పని దినం సందర్భంగా పేరెంట్‌ టీచర్స్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. ప్రభుత్వ బడులలో నాణ్యమైన ఆంగ్ల విద్యను అందిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం గంగకిషన్‌, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌ పద్మ, టీచర్లు జంగం శ్రీశైలం, సాయిలు, సహేందర్‌, నీలిమ, సంజీవ్‌ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోగ్రెస్‌ కార్డు అందజేస్తున్న డీఈవో

క్యాసంపల్లిలో....

క్యాసంపల్లి పాఠశాలలో సోమవారం విద్యార్థులు ప్రోగ్రెస్‌ కార్డ్స్‌ అందించారు. హెచ్‌ఎం తాడ్వాయి శ్రీనివాస్‌, సర్పంచ్‌ సందిరి మంజుల నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్‌ బాలకిషన్‌ గౌడ్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ శ్రీనివాస్‌ గౌడ్‌, ఎంపీటీసీ కోరండ భాగ్యలక్ష్మి రాజారెడ్డి పాల్గొన్నారు.

తెయూ అకౌంట్స్‌ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అకౌంట్‌ ఆఫీసర్‌ భాస్కర్‌ను సస్పెండ్‌ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెయూ పీడీఎస్‌యూ అధ్యక్షుడు సంతోష్‌ మాట్లాడుతూ.. అకౌంట్స్‌ సెక్షన్‌ ఆఫీసర్‌గా ఉన్న భాస్కర్‌ అక్రమ మార్గంలో సూపరింటెండెంట్‌ నుంచి అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందారని ఆరోపించారు. వీసీ రవీందర్‌ పాలకమండలి అనుమతి లేకుండా అక్రమంగా ఇచ్చిన పదోన్నతులను ఈ నెల 19న జరిగిన ఈసీ సమావేశంలో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆయన టేబుల్‌పై అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ బోర్డు పెట్టుకుని చలామణీ అవుతున్నారని విమర్శించారు. యూనివర్సిటీకి సంబంధం లేని వ్యక్తులకు వర్సిటీ అకౌంట్స్‌ సెక్షన్‌ నుంచి చెక్కులు జారీ చేస్తూ ఖజానా ఖాళీ అవడంలో భాస్కర్‌ ప్రధాన పాత్ర పోషించాడని ఆరోపించారు. నాయకులు శివ సాయి, రాజ్‌కుమార్‌, అస్విత్‌, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

నిజామాబాద్‌ సిటీ: వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కాంట్రాక్ట్‌ పద్ధతిన పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ మెడికల్‌ పబ్లిక్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌(హెచ్‌ 1) రాష్ట్ర అధ్యక్షుడు సాయారెడ్డి డిమాండ్‌ చేశారు. సోమవారం నిజామాబాద్‌ సుభాష్‌నగర్‌లో యూనియన్‌ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆశలకు నిర్దిష్ట వేతనం రూ.15వేలు ఇవ్వాలని, వారికి పని భారం తగ్గించాలన్నారు. సుదర్శన్‌, రాజశేఖర్‌, రవిచంద్ర, కరిపే రవీందర్‌, దేవేందర్‌, రవి, మధుకర్‌, వినోద్‌, నారాయణ, రజిని, సావిత్రి, వనజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయారెడ్డి

మహ్మద్‌నగర్‌లో కుస్తీపోటీలు

నిజాంసాగర్‌: గ్రామీణ ప్రాంత క్రీడలకు కుస్తీ పోటీలు కేరాఫ్‌గా నిలుస్తాయని జెడ్పీ మాజీ చైర్మన్‌ దఫేదార్‌ రాజు అన్నారు. సోమవారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు ఆయన బహుమతులు అందజేశారు. గున్కుల్‌ సొసైటీ చైర్మన్‌ వాజిద్‌అలీ, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, రెడ్యానాయక్‌, వెంకటేశం, విజయ్‌కుమార్‌, కాశయ్య, రామాగౌడ్‌, మహేందర్‌, జీవన్‌, ప్రకాష్‌, నరేశ్‌, ఎస్సై రాజు పాల్గొన్నారు.



మృతురాలి మెడలో బంగారం చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో గల ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళ మెడలో నుంచి బంగారం చోరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. డొంకేశ్వర్‌ మండలం దత్తాపూర్‌ గ్రామానికి చెందిన సుంకరి శకుంతల(55) అనారోగ్యంతో నిజామాబాద్‌ నగరంలోని ఖలీల్‌వాడి శ్రీ భవాని కేర్‌ ఆస్పత్రిలో ఈ నెల 21న అడ్మిట్‌ అయింది. ఆమె ఈనెల 23న ఉదయం చికిత్స పొందుతూ చనిపోయింది. శకుంతల ఒంటిపై గల రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును ఎవరో ఎత్తుకెళ్లారు. దీంతో సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దీంతో వారు ధర్నా విరమించారు. శకుంతల అల్లుడు గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



ధర్నా చేస్తున్న బాధితులు

పొందుర్తిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

రాజంపేట: మండలంలోని పొందుర్తిలో ముదిరాజ్‌ సంఘం, యాదవ సంఘం మధ్య ఓ స్థలం విషయంలో ఘర్షణ జరిగింది. ఈ దాడిలో పలువురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ తిరుపయ్య, ఎస్సై రాజు సిబ్బందితా కలిసి ఘటనా స్థలానికి చేరకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని చక్కదిద్దారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సదాశివనగర్‌: మండలంలోని మల్లుపేట్‌ గ్రామ శివారు 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు.. గాంధారి మండలం నేరల్‌ గ్రామానికి చెందిన చాకలి లక్ష్మణ్‌(35), పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్‌ కలిసి కుప్రియాల్‌ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై నేరల్‌ గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో హైదరాబాద్‌ నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన బస్సు వెనకు నుంచి ఢీకొంది. దీంతో బైక్‌ వెనుక కూర్చున్న లక్ష్మణ్‌ తల భాగం టైర్‌ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనాన్ని నడిపిస్తున్న ప్రశాంత్‌ హెల్మెట్‌ ధరించి ఉండడంతో గాయాలతో బయటపడ్డాడు. లక్ష్మణ్‌కు కూతురు శాలిని, కుమారుడు మోక్షిత్‌ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో సోమవారం ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటు వచ్చి కూలీ మృతి చెందాడు. గ్రామానికి చెందిన జంగమైన నర్సింలు(48) గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులకు కూలీగా వెళ్లాడు. అక్కడ గుండెపోటు రావడంతో వెంటనే భిక్కనూరు ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు కామారెడ్డికి తరలించగా అక్కడ పరీక్షలు నిర్వహిస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల ముగ్గురు కుమారులు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట కాలనీకి చెందిన రావుల రాజు (60) లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఏడాదిగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్‌ చేయించుకుంటున్నాడు. ఆస్పత్రులు తిరుగుతూ జీవితంపై విరక్తి చెందిన అతడు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి స్కూటీపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం గాలిస్తుండగా సోమవారం కామారెడ్డి పెద్ద చెరువు అలుగు వద్ద స్కూటీ, వస్తువలు కనిపించాయి. గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. మృతుడికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు ఉన్నారు. రెండో భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు



బీబీపేట: ఆరేళ్ల పాటు ప్రేమించి.. పెళ్లి చేసుకొమ్మని అడగడంతో నిరాకరించిన యువకుడి ఇంటి ఎదుట యువతి బైఠాయించి నిరసన తెలిపిన ఘటన సోమవారం మండలంలోని తుజాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. దోమకొండకు చెందిన మెతుకు మౌనిక డిగ్రీ చేస్తున్న సమయంలో తుజాల్‌పూర్‌ గ్రామానికి చెందిన అందె నాగరాజ్‌గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో ఆరు సంవత్సరాలు ప్రేమించుకున్నారు. ఒకరి పేరు మరొక్కరు టాటూలు వేసుకున్నామని, హైదరబాద్‌లో కలిసి చాలా సందర్భాల్లో ఫొటోలు కూడా దిగామని మౌనిక చెప్పింది. తీరా పెళ్లి చేసుకొమ్మని అడగడంతో నిరాకరించడమే కాకుండా దుర్భాషలాడుతున్నాడని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. గత పది రోజుల క్రితం సైతం పోలీసుల వద్దకు వెళ్లి వివరాలు తెలిపామని, అయినా పెళ్లి చేసుకోవడం లేదని తెలిపింది. పెళ్లి చేసుకునే వరకు యువకుడి ఇంటి ముందు నుంచి కదిలేది లేదన్నారు.

తిర్మన్‌పల్లిలో యువకుడి దారుణహత్య



నబీసాబ్‌(ఫైల్‌)

ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులో విశ్వ ఆగ్రోటెక్‌ సమీపంలో గంగారాం తండాకు చెందిన నబీసాబ్‌ అలియాస్‌ అక్బర్‌(28) హత్యకు గురైనట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. నబీసాబ్‌ మండల కేంద్రంలో హమాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన నబీసాబ్‌ స్నేహితులతో కలిసి సాయంత్రం వరకు మద్యం తాగినట్లు వైన్‌షాప్‌ సీసీ టీవీలు, స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గుర్తించారు. సాయంత్రం నబీసాబ్‌ భార్య అఫ్రీన్‌ బేగం ఫోన్‌ చేయగా స్విచ్‌ఆఫ్‌ రావడంతో ఆమె బంధువులకు సమాచారం అందించింది. వారు సోమవారం ఉదయం మళ్లీ మొబైల్‌కు ఫోన్‌ చేయగా రాంపూర్‌ గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తి సమాధానం ఇస్తూ ఫోన్‌ రాంపూర్‌ శివారులో విశ్వ ఆగ్రోటెక్‌ వద్ద దొరికిందని చెప్పాడు. వెంటనే నబీసాబ్‌ కుటుంబ సభ్యులు విశ్వ ఆగ్రోటెక్‌ వద్ద గాలించగా రోడ్డుపై చెప్పులు, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై నరేష్‌ ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్‌ బృందం, క్లూస్‌ టీమ్‌ ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. తలకు, మెడకు తీవ్ర గాయాలై నబీసాబ్‌ మృతి చెందినట్లు గుర్తించారు. మద్యం తాగిన చోటే కొట్టి చంపి ఖాళీ స్థలంలో మృతదేహాన్ని పారేసినట్లు పోలీసులు గుర్తించారు. నబీసాబ్‌తో మద్యం తాగిన ఇద్దరు బిహారీ కూలీలు, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. అఫ్రీన్‌ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బడాపహాడ్‌ దర్శనానికి వెళ్తుండగా..

- ఆటో బోల్తా పడి అత్త, అల్లుడి మృతి
- మరో ఏడుగురికి గాయాలు



మొహిన్‌(ఫైల్‌)



అమ్మది(ఫైల్‌)



బోల్తా పడిన ఆటో

బాన్సువాడ/వర్ని: బడాపహాడ్‌ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా పడి అత్త, అల్లుడు మృతి చెందగా నలుగురు చిన్నారులు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి హన్మాజీపేట శివారులో అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలు.. బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన మొహిన్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి బడా పహాడ్‌ దర్గా దర్శనానికి ఆదివారం రాత్రి ఆటోలో బయలుదేరారు. హన్మాజీపేట్‌ శివారు దాటిన తర్వాత బడాపహాడ్‌ అటవీ ప్రాంతంలో మొహిన్‌ నిద్రమత్తులో ఉండడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మొహిన్‌ (45), ఆయన అత్త అమ్మది(55) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న జుబేర్‌, సుల్తానా, అలియ, చిన్నారులు అమ్రీన్‌, అయాన్‌, అహిల్‌, అనాబియకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. మొహిన్‌ ఆటోను నెల రోజుల క్రితమే కొన్నాడని స్థానికులు చెప్పారు. మొహిన్‌, అమ్మది మృతితో సంగమేశ్వర కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాజంపేట: తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి హతమార్చిందో భార్య. రాజంపేటలో అనుమానాస్పదంగా మృతి చెందిన గంగు లింగం హత్య కేసును పోలీసులు ఛేదించారు. సోమవారం సీఐ తిరుపయ్య, ఎస్సై రాజు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గంగు లింగం భార్య లావణ్యకు పెద్దాయిపల్లి గ్రామానికి చెందిన శంకరిగారి గోవిందుతో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గోవిందుతో కలిసి భర్త లింగంను పెద్దాయిపల్లి శివారులో గల సిద్దుల గుట్ట ప్రాంతంలో గొంతు కోసి హత్య చేసింది. సోమవారం లావణ్య, గోవిందును అరెస్టు చేసి వారి నుంచి కత్తి, ఒక బైకు, 3 మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

పని చేయడానికి వచ్చి బంగారం చోరీ

- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు



మాట్లాడుతున్న టౌన్‌ సీఐ వెంకటనారాయణ

ఖలీల్‌వాడి: ఇంట్లో పని చేయడానికి వచ్చి బెడ్‌రూమ్‌లోని బంగారం ఎత్తుకెళ్లిన పనిమనిషిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన దేవకథే రాజమణి ఇండ్లలో పని చేస్తుంది. ఈ నెల 23న మధ్యాహ్నం సుభాష్‌నగర్‌లో గల చింతలపూడి రాధ ఇంటిలోకి పనిచేయడానికి వెళ్లిన రాజమణి ఆమె బెడ్‌రూంలోని బంగారం చోరీ చేసింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం పని మనిషి ఇంటికి వెళ్లి విచారించగా బంగారం దొంగిలించినట్లు ఒప్పుకుందన్నారు. నిందితురాలి నుంచి బంగారు నెక్లెస్‌, నల్ల పూసల దండ, రెండు జతల బంగారు కమ్మలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై లక్ష్మయ్య, ఏఎస్సై రామకృష్ణ, కానిస్టేబులు కవిత పాల్గొన్నారు.

విద్యుత్‌ తీగలు తగిలి టిప్పర్‌ దగ్ధం



కాలిపోతున్న టిప్పర్‌

మాచారెడ్డి: బీటీ రోడ్డు పనులు చేస్తుండగా ఓ టిప్పర్‌కు విద్యుత్‌ తీగలు తగిలి దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం మండలంలోని చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. చుక్కాపూర్‌, బంద రామేశ్వరపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో టిప్పర్‌ డ్రైవర్‌ పైన ఉన్న విద్యుత్‌ తీగలు గమనించక పోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ముందుగా టైర్లు అంటుకొని మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్‌ అప్రమత్తమై కిందికి దూకినట్లు గ్రామస్తులు తెలిపారు. హెల్పర్‌కు మాత్రం షాక్‌ తగిలి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే గ్రామస్తులు చికిత్స నిమిత్తం మాచారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.